


## ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎపిఎస్ఆర్‌టిసి డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని ఆర్‌టిఒ జి. ఆదినారాయణ అన్నారు. ఎపిఎస్ ఆర్‌టిసి శిక్షణ కళాశాలలో డ్రైవింగ్ పై శిక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా ఆర్‌టిసి డ్రైవర్ ( సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఏకాగ్రతతో స్టీరింగ్, క్లచ్, బ్రేక్, ఎక్స్‌లేటర్‌ను వాడే విధానంపై వివరించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపకూడదన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. డ్రైవింగ్‌కు వచ్చే ముందు ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఉండేవిధంగా చూసు కోవాలన్నారు. తగినంత నిద్ర, రెస్ట్ ప్రతి డ్రైవర్‌కు అవసరమని, అవి లేకపోతే మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆర్‌టిసి ప్రజా రవాణా అధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న డ్రైవర్లు పాల్గొన్నారు.


# మోడీని గద్దె దించండి.. దేశాన్ని రక్షించండి

## వామపక్షాల ప్రచారభేరి ప్రారంభం • వాడవాడలా అంబేద్కర్‌కు నివాళులు

ప్రజాశక్తి- రాజాం, రేగిడి

మోడీని గద్దె దించండి.. దేశాన్ని కాపాడండి.. అని సిపిఎం, సిపిఐ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యాన అంబేద్కర్ జయంత్రి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రచారోద్యమం చేపట్టారు.

రాజాం మండల కేంద్రంలోని పాలకొండ రోడ్డులోను, వంగర మండలం ఉణుకూరులోను అంబేద్కర్ విగ్రహాలకు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రచార భేరిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం గత తొమ్మిదేళ్లగా పథకం ప్రకారం దేశంలో మత విద్వేశాలను రెచ్చగొడుతోందన్నారు. భారత రాజ్యాంగాన్ని, లౌకిక తత్వాన్ని విధ్వంసం చేస్తోందన్నారు. దేశ సంపదను కార్పొరేట్‌శక్తులకు అమ్మేస్తూ, వారి దుర్మార్గాలను ప్రశ్నించేవారిపై కేసులు పెడుతూ నిర్బంధాలకు పాల్పడుతోందని అన్నారు. ప్రైవేటీకరణ విధానాలతో రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మోడీ ప్రభుత్వం పట్టడం లేదన్నారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకపోగా ఉత్తరాంధ్ర జిల్లాలకు తల మానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి, టిడిపి మోడీని విమర్శించకపోవడం విడ్డూరమన్నారు. మోడీతో సొంత ప్రయోజనాలకు లొంగిపోయి రాష్ట్ర ప్రయోజనాలు గాలికి వదిలేసారని అన్నారు. రానున్న రోజుల్లో మోడీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు, నాయకులు పోరెడ్డి విశ్వనాథం, ఎం.త్రినాధ, పి.శంకరరావు, సిపిఐ నాయకులు నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.



రాజాం.. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

**విజయనగరంటౌన్ :** అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దాడి చేస్తోందని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపైనా ఉందని సిపిఎం నాయకులు రెడ్డి శంకర్రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. ప్రచారభేరిని కలెక్టరేట్ వద్ద ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభనుద్దేశించి వారు మాట్లాడుత 75 ఏళ్లుగా నిర్మించు కున్న ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం అమ్మేయడం, విద్వేషాలు రెచ్చగొట్టడం, రాజ్యాంగాన్ని లౌకిక తత్వాన్ని విధ్వంసం చేయడం, కార్పొరేటర్ల దేశంగా మార్చడం, మోడీ చేస్తున్న దుర్మార్గాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం వంటి నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నదని అన్నారు. మోడీ నియంతత్వ విధానాలకు వ్యతిరేకంగా , ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు బుగత అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్, నాయకులు బి.రమణ, వి.రామచంద్రరావు, ఆర్.శ్రీను, సిపిఐ నాయకులు రంగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, పావని, ఎఐఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలి :** సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన పట్టణంలోని వేణుగోపాల స్వామి కోవెల సెంటర్ నుండి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు, నాయకులు రామ్మోహన్, సిపిఐ నాయకులు ఎం. శ్రీనివాసరావు మాట్లాడారు. మోడీ అనుసరిస్తున్న వినాశకర విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30వరకు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తామనితెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి. యుగంధర్, జి. గౌరీష్, జె. రామారావు మణికుమార్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.





విజయనగరంలో కలెక్టరేట్ వద్ద ప్రచారభేరి నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

**గరివిడి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ, నాయకులు ఎ.గౌరినాయుడు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సిఐటియు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం ఉందని ఉందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని ఒక్క మాట కూడా అనకుండా వారికి వైసిపి, టిడిపి మద్దతు పలుకుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె. విశ్వనాథరాజు, ఫేకర్ కార్మికులు పాల్గొన్నారు

**గజపతినగరం :** అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, టి.పైడిపునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఐ నాయకులు జి.రామునాయుడు, డి.సింహాద్రి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

**రామభద్రపురం :** స్థానిక మూడురోడ్ల జంక్షన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యాన ప్రచార భేరి ప్రారంభించారు. సిపిఎం, సిపిఐ నాయకులు బలస శ్రీను, అలమండ ఆనందరావు మాట్లాడారు. మోడీని గద్దెదించి దేశాన్ని కాపాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**కొత్తవలస :** మనువాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సిపిఎం నాయకులు గాడి అప్పారావు అన్నారు. కొత్తవలస జంక్షన్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఠా కార్మికులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరులు

# అంబేద్కర్ ఆశయాలకు పునరంకితం

## మంత్రి బొత్స • నగరంలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల మేరకు సమసమాజ స్థాపనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆ మహనీయుని ఆశయ సిద్దికోసం పునరంకితమవుతామని చెప్పారు. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని పూర్వపు బాలాజీ జంక్షన్ వద్ద పాత విగ్రహం స్థానంలో కొత్తగా నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని అన్ని మతాలు, కులాలు, జాతుల వారికి సమాన హక్కులు వుండాలని పేర్కొంటూ వాటిని రాజ్యాంగంలో పొందుపరచి తద్వారా సమసమాజ స్థాపనకు కృషి చేసిన గొప్పవ్యక్తి అంబేద్కర్ అని పేర్కొన్నారు. కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతుగా కృషి చేయాల్సి ఉందన్నారు. నగరంలో కూడళ్ల సుందరీకరణలో భాగంగా బాలాజీ కూడలిని అంబేద్కర్ కూడలిగా నామకరణం చేసి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినప్పల నాయుడు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక, నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, రేవతి, కమిషనర్ శ్రీరాములు నాయుడు, ఆర్‌డిఒ ఎంవి.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

**భారత రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు**

**విజయనగరం :** ఎన్నో జాతులు, మతాలు, కులాలతో కూడిన మన దేశం నేటికీ ఐక్యంగా వున్నదంటే అందుకు కారణం భారతరత్న బి.ఆర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగమేనని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జరిగాయి. తొలుత కోలగట్లతోపాటు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక, మేయర్ విజయలక్ష్మి కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కోలగట్ల మాట్లాడుతూ తనకున్న మేధోశక్తితో దళిత, గిరిజన వర్గాల వారిని సమాజంలోని ఇతర వర్గాలతో సమానస్థాయికి తీసుకురావాలని పరితపించి ఎంతగానో కృషిచేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు మంచి విద్యావంతులుగా రూపొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఎస్‌పి దీపిక మాట్లాడుతూ దేశంలోని మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యేక హక్కులు కల్పించడం ద్వారా వారు ఇతరులతో సమాన అవకాశాలు పొందే పరిస్థితిని ఏర్పరిచారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, డిసిసిబి చైర్మన్ వి.చినరామునాయుడు, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, సాంఘిక సంక్షేమ డిడి రత్నం, అంబేద్కర్ గురుకులాల జిల్లా సమన్వయ అధికారిణి చంద్రావతి, తదితరులు పాల్గొన్నారు.



# చేపల వేటకు బ్రేక్

**సముద్ర జలాల్లో చేపలు వేటకు తాత్కాలికంగా రెండు నెలలు పాటు బ్రేకులు పడనున్నాయి. ఈ నెల 14 నుంచి జూన్ 15వరకు సుమారు 61 రోజులపాటు వేట నిషేధ ఆజ్ఞలు అమల్లోకి వచ్చాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంఉత్తర్వులను జారీ చేసింది. సముద్రంలో మత్స్య సంపద పెంపొందించేందుకు ఏటా మర పడవలకు ఈ ఆజ్ఞలు అమలు చేస్తున్నారు. దాంతో రెండు నెలలు పాటు మత్స్యకారులకు బతుకు భారంగా మారనుంది.**

- నేటి నుంచి వేటకు విరామం
- నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులు
- మత్స్యకారులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి -పూసపాటిరేగ

జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో సుమారుగా 27 కిల్లో మీటర్ల మేర తీరం ఉంది. ఈ తీరం వెంబడి 19 మత్స్యకార గ్రామాలున్నాయి. ఈ రెండు మండలాల్లో 1128 బోట్లు ఉన్నాయి. ఇందులో మర బోట్లు 711 ఉండగా, సాంప్రదాయ బోట్లు 417 ఉన్నాయి. సుమారుగా 10 వేల మంది మత్స్యకారులు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను చేపల వేటపై ఆదారపడి జీవనం సాగిస్తున్నారు. మరబోట్లుపైనే ఎక్కువ మంది మత్స్యకారులు ఆధార పడి జీవిస్తున్నారు. వీరందరికీ నిషేధాజ్ఞలు వర్తించడంతో వీరి జీవనం ఆగమ్యగోచరంగా మారనుంది. ఇప్పటికే సముద్రంలో వర్ధజలాలు కారణంగా సముద్రంలో చేపలు దొరకక మత్స్యకారులు వలసబాట పడుతున్నారు. ప్రతి ఏటా 61 రోజులు పాటు వేట లేకపోవడంతో ఆకలితో అల్లాడే పరిస్థితి నెలకొననుంది. ప్రభుత్వం అందిస్తున్న వేట నిషేధ భృతి రూ. 10 వేలు అరకొరగానే ఉంటుందని మత్స్యకారులు వాపోతున్నారు.

నిషేధానికి కారణం ఇదే...

వేట నిషేధ కాలంలో ముఖ్యంగా చేపలు, రొయ్యలు వంటి మత్స్య జాతులు గుడ్లు పెడుతూ మత్స్య సంపదను అబివృద్ధి చేస్తుంటాయి. ఈ సమయంలో మర బోట్లు వేట వల్ల వాటికి తీవ్ర నష్టం జరుగుతుందని సంబంధిత అధికారులు గుర్తించారు. మర బోట్లు ద్వారా సముద్రంలో వేట చేస్తున్నప్పుడు విడుదలయ్యే ఆయిల్ సముద్రంలో కలిసి చేపల గుడ్లు నాశనం మవుతాయి. గుడ్లు పెట్లే చేపలు వలలో పడి మత్స్య సంపద అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలుగుతుంది. దాంతో ఈ సమయంలో వేట నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చాయి. . ఈ సమయంలో వేటాడితే చట్ట ప్రకారం శిక్షలు వేస్తూ, జరిమానాతో పాటు వేటాడిన మత్స్య సంపదను స్వాదీనం చేసుకుంటారు. బోటును, వలలను సీజ్ చేస్తారు. బోటు యెక్క రిజష్టేషన్ రద్దు చేయడంతో పాటు ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలును రద్దు చేస్తారు. సాంప్రదాయ మత్స్యకారులు నాటు పడవలతో వేట సాగించవ వచ్చునని ఆశాఖ అధికారులు చెబుతున్నారు. నాటు పడవల వేట వల్ల సముద్రంలో మత్స్య సంపదకు ఎటువంటి హని కలగదని చెబుతున్నారు.

**నిషేధభృతి రూ. 20 వేలు ఇవ్వాలి**

వేట నిషేధ సమయంలో వేట కారులకు రూ.20 వేలు భృతి ఇవ్వాలి. రెండు నెలులు నిషేధం పెట్టి రూ. 10 వేలు ఇవ్వడం బాగాలేదు. రైతులకు వ్యవసాయం చేస్తుండగా రైతు భరోసా ఇస్తున్నారు. మత్స్యకారులకు మాత్రం నిషేధంలో ఉన్నప్పుడు కుటుంబ పోషణకు సరిపడేలా, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగునంగా నిషేదభృతి ఇవ్వాలి. ఇలాంటి సమయంలో వలసలు పెరుగుతున్నాయి. వలసలను అరికట్టేలా జీవన భృతి పెంచాలి.

**- బర్రి చిన్నప్పన్న, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు**

**అందరికీ భృతి ఇవ్వాలి**

వేట నిషేధ భృతి అందరికీఇవ్వడం లేదు. 50 సంవత్సరాలు ఉన్న వారందరికీ పింఛను ఇస్తున్నామని చెప్పి భృతి ఇవ్వడం లేదు. దాంతో చాలా మంది మత్స్యకారులు నష్టపోవాల్సి వస్తుంది. వేటాడే అందరికీ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ఇచ్చే అరకొర భృతి కూడా సక్రమంగా ఇవ్వకపోతే ఎలా?. కార్డులు లేవు, కాగితాలు లేవంటూ భృతి ఎగ్గొటేందుకే ప్రభుత్వం చూస్తుంది.

**- మైలపల్లి సింహాచలం. టిడిపి మత్స్యకార సమితి రాష్ట్ర కన్వీనర్**

**ఉపాధి పని కల్పించాలి**

వేట నిషేధ సమయంలో ప్రభుత్వం మాకు ప్రత్యామ్నాయ పనులు కల్పించాలి. ఉపాధి హామీలో బాగంగా వలలు, తెప్పలు బాగు చేసుకొవడానికి అవకాశం ఇవ్వాలి. ఆ సమయంలో మాకు రోజువారీ కూలీ ఇవ్వాలి. దీని ద్వారా వేట నిషేద సమయంలో మాకు పని దొరుకుతుంది. వేరొక ప్రాంతాలుకు వలస వెళ్లకుండా గ్రామంలోనే ఉంటాం. జీవనభృతి పెంచాలి.

**- కర్రి పోలయ్య. మత్స్యకారుడు, తిప్పలవలస గ్రామం, పూసపాటిరేగ మండలం**

**కోస్టుగార్డు, నేవీతో గస్తీ ఏర్పాటు**

వేట నిషేధం పక్కాగా అమలయ్యేలా నేవీ, కోస్టుగార్డు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, మత్స్యశాఖ తో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. మోటారు బోట్లతో సముద్రంలో వేటాడకూడదు. నిషేధ ఉత్తర్వులను దిక్కరించి చేపల వేట చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. మత్స్య సంపదను స్వాధీనంతో పాటు జరిమానా విధిస్తూ, డీజిల్ ఆయిల్‌పై రాయితీ సౌకర్యాన్ని నిలుపుదల చేస్తాం. చేపల వేట నిషేదం కారణంగా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు రూ. 10వేలు చొప్పున ఆర్థిక సహాయం బ్యాంక్ ఖాతాకు జమ చేస్తాం.

**-యు.చాందిని, ఎఫ్‌డిఒ, భోగాపురం**

## చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు

**'ప్రజాశక్తి' కథనానికి స్పందన**

ప్రజాశక్తి-శృంగవరపుకోట

'ప్రజాశక్తి'లో 'యథేచ్ఛగా చెరువుల కబ్జా' అనే కథనానికి తహశీల్దార్ శ్రీనివాసరావు స్పందించి శుక్రవారం ఆక్రమణకు గురైన చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ముసిడిపల్లి పంచాయతీ పరిధిలో ఎస్‌విఎన్ లేఅవుట్‌లో ఆక్రమణలకు గురైన చెరువులను పరిశీలించినట్లు తెలిపారు. నాలుగు చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. హెచ్చరిక బోర్డులున్నా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

# మనోడే.. మళ్లీ ఇచ్చేయండి!

- ఇప్పలవలస పాత ఫీల్డ్ అసిస్టెంట్‌కు పోస్టింగుకు పావులు
- అధికారులపై వైసిపి నేతల ఒత్తిడి
- రాత్రికి రాత్రే కొత్త మేట్‌గా అవతారం
- అవాక్కయిన ఉపాధి కూలీలు
- పనులు నిలిపివేసి నిరసన



ఆందోళన చేస్తున్న ఇప్పలవలస ఉపాధి వేతనదారులు

**ఉపాధి హామీ అమల్లో అధికార పార్టీ నేతల అతిజోక్యం.. క్షేత్రస్థాయి ఉద్యోగులకు ప్రాణసంకటంగా పరిణమించింది. ఎప్పుడు ఎవరి ఉద్యోగానికి ఎసరు వస్తుందో, అకారణంగా ఏ ఆరోపణలకు గురికావాల్సి వస్తుందోనన్న ఆందోళనతో దినదిన గండంగా బతకాల్సి వస్తోంది. ఉన్నవారిని టిడిపి సానుభూతిపరులని ముద్రేసి, అన్యాయంగా పీకేసి తమవారిని అందలం ఎక్కించడానికి ఎంతకైనా సిద్ధపడుతున్న వైసిపి నాయకుల దాష్టీకానికి ఇప్పటికే సుమారు ఆరేడు గ్రామాల క్షేత్ర స్థాయి సిబ్బంది బలయ్యారు. తాజాగా వారి దృష్టి మరొకరిపై పడింది. ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించేందుకు కుట్ర షురూ అయింది. దీంతో ఆ గ్రామంలో అలజడి మొదలైంది. ఈ ఎత్తుగడను వ్యతిరేకిస్తూ స్థానిక ఉపాధి కూలీలు పనిని అర్థాంతరంగా నిలిపివేసి ఆందోళనకు దిగారు.**

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలో ఇప్పలవలస ఫీల్డ్‌అసిస్టెంట్‌గా సీతంనాయుడు పనిచేశారు. అవినీతి ఆరోపణల నడుమ ఆయనను 12 ఏళ్ల క్రితం జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. అనంతరం చింతాడవలసకు చెందిన రామునాయుడును ఫీల్డ్‌అసిస్టెంట్‌గా నియమించారు. ఈ రెండు గ్రామాలను వేర్వేరు పంచాయతీలుగా మార్చారు. ఇప్పలవలస, చింతాడవలస బాధ్యతలను ఆయన చూస్తున్నారు. అవినీతి అక్రమాల ఆరోపణలు రుజువై తొలగించబడ్డ మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ సీతంనాయుడును మళ్లీ నియమించేందుకు స్థానిక వైసిపి నాయకులు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా రెండు వారాల నుంచి ఆయన్ను సాధారణ కూలీగా పనికి పంపించి, శుక్రవారానికి మేట్ అవతారం ఎత్తించారు. కొన్నాళ్ళు గడిచాక తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్‌ని చేసేందుకు పథక రచన చేశారు.

**రాత్రికి రాత్రే..**

ఆ రెండు పంచాయతీలు విడిపోయినా మేట్ల సహాయంతో నెట్టుకొస్తున్నారు. ఇందులో భాగంగానే సుమారు ఏడాది నుంచి ఉపాధి మేట్‌గా పనిచేస్తున్న వసంత మొబైల్ నుంచి (ఎన్ఎంఎంఎస్) యాప్‌ను తొలగించి, దాన్ని సీతంనాయుడి మొబైల్‌లోకి మార్చారు. ఈ కుట్ర సంగతి తెలియక ఎప్పటిలాగే శుక్రవారం విధులకు హాజరైన వసంత తన మొబైల్‌లో యాప్ మాయమవడం, అది సీతంనాయుడు ఫోన్లో ప్రత్యక్షమవడం, ఇకపై తానే మేట్‌నని ఆయన కూలీలతో చెప్పడంతో అవాక్కవడం ఆమె వంతైంది. సంబంధిత అధికారులను ఆమె సంప్రదించే ప్రయత్నం చేయగా వారు అందుబాటులో లేరని తెలియవచ్చింది. గురువారం రాత్రి వరకూ ఉన్న యాప్, శుక్రవారం ఉదయానికే మాయమవడం బట్టి రాత్రికి రాత్రే కథ నడిపించినట్టు స్పష్టమవుతోంది. మేట్లుగా మహిళలను నియమించాలనే నిబంధనలున్నా... అందుకు విరుద్ధంగా పురుషుడిని నియమించడం కొసమెరుపు.

**కూలీల ఆందోళన**

శుక్రవారం సీతంనాయుడిని మళ్లీ తెరపైకి తీసుకురావడం స్థానికంగా చర్చకు దారితీసింది. వసంత తొలగింపు, సీతం నాయుడి నియామకంపై వారు మండిపడ్డారు. శుక్రవారం పనులు నిలిపివేసి నిరసనకు దిగారు. ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వసంతకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని వారు స్పష్టంచేశారు.

**మచ్చుతునకలివిగో...**

మండలంలో ఉపాధి హామీ చట్టం కొందరు అధికారుల స్వామిభక్తి వల్ల అధికార పార్టీకి చుట్టంలా మారింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక మెంటాడ, పిట్టాడ, మీసాలపేట, కూనేరు సహా ఆరేడు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లపై అవినీతి ఆరోపణలు నెట్టి వారిని తొలగించారు. ఆ స్థానాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పనిచేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయిన వారిని కొత్తగా నియమించారు. వైసిపి నాయకులకు అధికారులు దాసోహమవడంతో ఆ నేతలు ఆడిందే ఆటగా సాగుతోంది. తాజా ఉదంతంతో ఒక్క ఉపాధి సిబ్బందే కాకుండా మరికొంతమంది చిరుద్యోగులు కూడా బితుకుబితుకుమంటున్నారు.

**ఇదేం పద్ధతి? : సర్పంచ్ పైడిరాజు**

ఉద్యోగం నుంచి తొలగించిన సీతంనాయుడిని తిరిగి ఫీల్డ్‌అసిస్టెంట్‌గా నియమిస్తే న్యాయపోరాటం చేస్తామని సర్పంచ్ పైడిరాజు హెచ్చరించారు. రెండు గ్రామాలకు విడివిడిగా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమిస్తే తమకు అభ్యంతరం లేదని చెప్పారు. పాత మేట్లతో హాజరు వేయించినా అభ్యంతరం లేదన్నారు. అలా కాకుండా పాత వ్యక్తిని వైసిపి నాయకులు తమ స్వార్థానికి తమనెత్తిన బలవంతంగా రుద్దాలని ప్రయత్నిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. త్వరలో ఈ విషయమై జిల్లా కలెక్టరును కలవనున్నట్టు చెప్పారు.

**ఎంపిడిఒ వివరణ**

ఈ వ్యవహారంపై ఎంపిడిఒ త్రివిక్రమరావును వివరణ కోరగా, మహిళా మేట్ వసంత మొబైల్‌లో యాప్ తొలగింపు, పాత ఫీల్డ్‌అసిస్టెంట్ యాప్‌లోకి మళ్లింపు విషయాలేవీ తన దృష్టిలో లేవన్నారు. దీనిపై పరిశీలిస్తానని చెప్పారు. మండల ఉపాధి హామీ ప్రోగ్రామింగ్ అధికారిగా కూడా ఎంపిడిఒ వ్యవహరిస్తున్న విషయం ఇక్కడ గమనార్హం.

# సమస్యలు పరిష్కరించండి

## అంబేద్కర్ విగ్రహానికి విఆర్‌ఎల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టరేట్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం నాయకులు కె.గురుమూర్తి, సిఐ టి యు నగర అధ్యక్షులు బి.రమణ మాట్లాడుతూ విఆర్‌ఎలకు ఫేస్ యాప్‌ల ద్వారా హాజరు ఉండాలని నిబంధన విధించడం వల్ల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విఆర్‌ఎలలో ఎక్కువ మంది వయసు రీత్యా సచివాలయాలకు, తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చి హాజరు వేసుకునే పరిస్థితి లేదన్నారు. ఎక్కువ మందికి సాంకేతికను ఉపయోగించుకునే పరిస్థితి లేదన్నారు. వయసు పైబడిన వారు, నామినీలుగా పని చేస్తున్నవారు ఫేస్ యాప్ ద్వారా హాజరు ఇవ్వడం సాధ్యం కాదన్నారు. గతంలో 2018లో కూడా ప్రభుత్వం విఆర్‌ఎలకు బయోమెట్రిక్ వెయ్యాలనే నిబంధన తీసుకువచ్చి నప్పుడు కూడా ఆచరణ సాధ్యం కాదని యూనియన్ చేసిన విజ్ఞప్తి మేరకు బయోమెట్రిక్ నుండి మినహాయింపు చేశారని తెలిపారు. ఫేస్ యాప్ ద్వారా హాజరు వేసేందుకు విఆర్‌ఎలకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎల వేతనం రూ.26వేలకు పెంచాలని, డిఎతో కూడిన వేతనం ఇవ్వాలని, విఆర్‌ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హులందరికీ విఆర్ఒ, అటెండర్, వాచ్‌మెన్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



వేపాడ.. అంబేద్కర్ విగ్రహానికి వినతి అందిస్తున్న విఆర్‌ఎలు, సిఐటియు నాయకులు

**లక్కవరపుకోట :** విఆర్‌ఎలకు ముఖ హాజరు విధానం రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన విఆర్‌ఎలు నిరసన చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తరిణి వెంకటరమణ, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

**డెంకాడ :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డెంకాడలో అంబేద్కర్ విగ్రహానికి విఆర్‌ఎల సంఘం మండల కార్యదర్శి ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యాన వినతి అందించారు. కార్యక్రమంలో నాయకులు పెంటరాజు, డి.గంగులు పాల్గొన్నారు.

**వేపాడ :** మండల కేంద్రంలో సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్, విఆర్‌ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు వెంకన్న ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి అందించారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్



ప్రచార పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

## పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని పెదబూరాడపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, ఎంపిటిసి సంగంరెడ్డి జగన్నాథం, నాయకులు కోట్ల పైడినాయుడు, కర్రోతు వెంకట రమణ, వాల్లే అప్పల నాయుడు, గుంట మాని ఉమ, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మ

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కొండవెలగాడలో అభివృద్ధి పనులకు శుక్రవారం ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు శంకుస్థాపన చేశారు. ఎస్‌సి కాలనీలో రూ.5 లక్షలతో సిసి కాలువలు, రెడ్డికవీధిలో రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మించనున్నారు. కార్యక్రమంలో నాయకులు మొయిద అక్కోజీ, చంద్రంపేట మాజీ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, వాల్లె అప్పలనాయుడు, పూతికపేట మాజీ సర్పంచ్ యడ్ల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థిక సాయం అందజేత**

ఇటీవల విద్యుత్తు స్తంభంపైనుంచి ప్రమాదవశాత్తూ పడి ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వంకర అప్పారావుకు ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మ, జెడ్‌పిటిసి సన్యాసినాయుడు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.



ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న పిఎసిఎస్ అధ్యక్షులు సింహాచలం

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

### పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం

ప్రజాశక్తి-డెంకాడ

సిఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం తెలిపారు. శుక్రవారం డెంకాడ మేజర్ పంచాయతీ పరిధిలోని దొడ్డుబాడువ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజల అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. పంచాయతీల అభివృద్ధికి సిఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సిఎంగా, బడ్డుకొండ అప్పలనాయుడును మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, నాయకులు రొంగలి గోపాలకృష్ణ, చలుమూరి అప్పలనాయుడు, సిరికి అప్పారావు, నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్‌కు నివాళి**

డెంకాడలో అంబేద్కర్ విగ్రహానికి పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొడ్డుబాడువలోనూ ఆయన ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు.



రాంబాబును పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ కామినాయుడు

## ప్రజాశక్తి విలేకరికి పరామర్శ

ప్రజాశక్తి-వంగర

వంగర మండలం ప్రజాశక్తి విలేకరి డర్రు రాంబాబు తండ్రి పోలయ్య (85) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈనేపథ్యంలో ఆయన కుటుంబాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు విశ్వనాథం, ప్రజాశక్తిఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు, జిల్లా కన్వీనర్ కె.రమేష్‌నాయుడు, సిహెచ్‌రాము తదితరులు పరామర్శించారు.

## వేణుగోపాలపురంలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి -విజయనగరం కోట

టిడిపి ఆధ్వర్యాన శుక్రవారం నగరంలోని ఒకటో డివిజన్ వేణుగోపాలపురంలో ఇదేం కర్మమన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, టిడిపి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కనకల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

అంబేద్కర్ జయంతి సందర్భంగా సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం, కెజిబివి, విక్టరీ పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ఆ విద్యాలయాల ప్రిన్సిపల్స్ ఉషారాణి, కిరణ్మయి, విక్టరీ పాఠశాల కరస్పాండెంట్ అందజేశారు.

## అగ్నిప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని సింగారపువీధిలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలి సర్వం కోల్పోయిన తిరుపతి కుటుంబ సభ్యులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు.



విజయనగరం.. అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీమంత్రి అశోక్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని వక్తలు కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల వారిని ఇతరులతో సమాన స్థాయికి తీసుకువచ్చేందుకు వారికి ప్రత్యేక హక్కులు కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ సిఇఒ అశోక్ కుమార్, మన్మథకుమార్ తదితరులు పాల్గొన్నారు. ● డిసిఎంఎస్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇన్ ఛార్జ్ అవనాపు విక్రమ్ పూలమాలవేసి నివాళులర్పించారు. డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ సాయికుమార్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ రావు, సిబ్బంది పాల్గొన్నారు. ● జిల్లా కోర్టులో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సిహెచ్ దామోదరరావు అధ్యక్షతన అంబేద్కర్ జయంతి జరిగింది. అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా అదనపు న్యాయ మూర్తి కె రాధా రత్నం పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రస్తుత కాలంలో రాజ్యాంగ విలువలు సన్నగిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలు,మహనీయుల ఆశయాలు, ఆదర్శాలు ఆచరించినప్పుడే అంబేద్కర్‌కు సముచిత స్థానం ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. అదనపు న్యాయ మూర్తి షేక్ సికిందర్ భాషా, సినియర్ సివిల్ జడ్జి జె శ్రీనివాస రావు, బి హెచ్ లక్ష్మీ కుమారి, పలువురు జూనియర్ న్యాయ మూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ● అంబేద్కర్ జయంతిని కస్పా నగర పాలక ఉన్నత పాఠశాలలో ఉన్న ఎపిజె అబ్దుల్ కలాం స్కౌట్ యూనిట్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్ ఈపు విజయకుమార్, జిల్లా కార్యదర్శి వాకా చిన్నం



శృంగవరపుకోట.. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

నాయుడు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ● కలెక్టరేట్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి జనసేన నాయకులు గురాన అయ్యలు పూలమాల వేసి నివాళు లర్పించారు. ● ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షులు మువ్వల గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● బిసి సంఘ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు గదుల వెంకటరావు మాట్లాడారు. ● బాలాజీ జంక్షన్‌లోగల అంబేద్కర్ విగ్రహానికి బిజెపి అధ్యక్షులు రెడ్డిపావని పూలమాల వేసి నివాళు లర్పించారు. ● చీపురుపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున పూలమాల వేసి నివాళులర్పించారు. ● అశోక్‌బంగ్లాలో అంబేద్కర్ చిత్రపటానికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో భావితరాన్ని నాశనం చేసే పద్ధతి నడుస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. ● జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆ సంస్థ కార్యదర్శి ఎన్.లలిత పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి బి. లక్ష్మి , సిబ్బంది పాల్గొన్నారు. ● స్థానిక తోట పాలెం లో గల సత్య డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ పూల మాల వేసి నివాళులర్పించారు. కళాశాల సంచాలకులు డాక్టర్. మజ్జి శశి భూషణ్ రావు, ప్రిన్సిపాల్ ఎంవి సాయిదేవమణి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి కార్యాలయంలో..** ప్రజాశక్తి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో మనువాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఉద్యమించాలని అన్నారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ పి.అప్పారావు అధ్యక్షతన జరిగిన

### జిల్లా వ్యాప్తంగా ఘనంగా జయంతి ఉత్సవాలు

కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు

**డెంకాడ :** మండలంలోని మోపాడలో ఎస్‌సి కాలనీలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. అనంతరం విగ్రహానికి నివాళులర్పించారు. గుణుపూరు, మోపాడ గ్రామాల్లో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు పాల్గొని, నివాళులర్పించారు. గుణుపూరులో వృద్ధులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ద్వారపురెడ్డిపాలెంలో సర్పంచ్ కోరాడ కనకరాజు, పినతాడివాడలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజినిగిరి అచ్చెన్నాయుడు.. అంబేద్కర్‌కు నివాళులర్పించారు. రఘుమండలో యువత రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. డెంకాడలోని ఎస్‌సి కాలనీలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యాన అంబేద్కర్‌కు నివాళు ర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాణీరాజు, ప్రదీప్‌రాజు, చిన్న పాల్గొన్నారు.

**తెర్లాం :** పెదపాలవలసలో అంబేద్కర్ విగ్రహాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ఆవిష్కరించారు. తెర్లాం ఎస్‌బిఐ బ్రాంచ్ వద్దనున్న అంబేద్కర్



ప్రజాశక్తి కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, ప్రజాశక్తి సిబ్బంది


విగ్రహానికి జనసేన నాయకులు బాబు పాలూరు పూలమాలలు వేశారు. తహశీల్దార్ కార్యాలయంలో గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను ఆర్‌డిఒ పి.శేషశైలజ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి ఎన్.ఉమాలక్ష్మి, వైస్ ఎంపిపి సి.హెచ్ సత్యనారాయణ, సర్పంచ్ బి.రూప, ఎంపిటిసి జి.ఆనంద్, తహశీల్దార్ డి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

**బొబ్బిలి :** పట్టణంలో స్టేట్ బ్యాంక్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఎస్‌ఐబి సిఐ ఆర్.జైభీమ్, తదితరులు పండ్లు పంపిణీ చేశారు. టిపి మున్సిపల్ పాఠశాలలో యుటిఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షులు చంటి ఆధ్వర్యాన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, నాయకులు స్వామినాయుడు, సత్యనారాయణ, అజయ్, పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు ఆనెం శ్రీనివాస్, బి.రమేష్ పాల్గొన్నారు.

**రేగిడి :** సంకిలిలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి, సొసైటీ అధ్యక్షులు రాయపురెడ్డి కృష్ణారావు, ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు, ఎంఇఒ ఎం.వరప్రసాదరావు, దేవుదలలో సర్పంచ్ కుప్పిలి దుర్గమ్మ గవరయ్య, వైసిపి నాయకులు రాయపురెడ్డి శ్రీకాంత్, కోదండరావు, కెంబూరు శ్రీహరి, కుప్పిలి తిరుమలరావు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

**లక్కవరపుకోట :** ఎస్‌సి బాలుర వసతిగృహం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, సర్పంచ్ కిర్రు పార్వతి, మల్ల రామకృష్ణ, సిపిఎం నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ, వైసిపి నాయకులు షేక్ ఖాసీం, బుజ్జి, జనసేన నాయకులు షేక్ ఫిరోజ్ వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు నివాళులర్పించారు. పెదర్జునవీధిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎంపిటిసి గాదం అప్పారావు ఆధ్వర్యంలో యువత నివాళులర్పించి, హాస్టల్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

**నెల్లిమర్ల :** రామతీర్థం జంక్షన్‌లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న



కొత్తవలస.. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేత గొంప కృష్ణ, నాయకులు



అంబేద్కర్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డిప్యూటీ స్పీకర్

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు, దళిత నాయకులు పోతల రాజప్పన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. జరజాపుపేట దళిత కాలనీలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో కిల్లంపల్లి రామారావు, తాలాడ సన్నిబాబు.. బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి అంజలి ఘటించారు.

సెంచూరియన్ యూనివర్సిటీలో అంబేద్కర్ చిత్రపటానికి విసి జిఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్.ఎస్.వర్మ నివాళు లర్పించారు.

**రామభద్రపురం :** మండలంలోని తారాపురంలో అంబేద్కర్ విగ్రహానికి ఎస్ఐ సురేంద్ర నాయుడు నివాళులర్పించారు. నాయకులు బెవర సీతారాం, ఎంపిటిసి సునీత పాల్గొన్నారు.

**శృంగవరపుకోట :** ఎస్.కోట మండలం వీరనారాయణంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. విగ్రహం ఏర్పాటు చేసిన కమిటీకి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, సర్పంచ్ ఎం.సరోజిని, ఎంపిటిసి బి.వెంకటలక్ష్మి, చామలాపల్లి సర్పంచ్ సూర్యారావు పాల్గొన్నారు. పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నివాళులర్పించారు. దేవి కూడలి వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, అఖిలభారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తలి గౌరునాయుడు, జిల్లా దళిత మహిళ అధ్యక్షులు సురాతి కృష్ణమ్మ వేర్వేరుగా నివాళులర్పించారు.

ధర్మవరం హైస్కూల్లో పీడీ పొట్నూరు శ్రీరాములు, జనసేన కార్యాలయంలో



వేపాడ.. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తదితరులు

నాయకులు వబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

**కొత్తవలస :** కొత్తవలస పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్, గాంధీజీ, పింగళి వెంకయ్య చిత్రపటాలకు సర్పంచ్ రామస్వామి, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, అయ్యారక సంక్షేమ సంఘం సభ్యులు రామన్నపాత్రుడు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకుడు గొంప కృష్ణ, గొరపల్లి రాము, కోళ్ల శ్రీను, కనకాల శివ పూలమాలలు వేశారు.

**వేపాడ :** మండలంలోని వావిలపాడు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి మండల ఉపాధ్యక్షులు పోతల రమణ, ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ బీల రాజేశ్వరి, ఉపసర్పంచ్ జి.వెంకటలక్ష్మి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు నాగిరెడ్డి రాజనాయుడు, బూడి చినబాబు, గురంబిల్లి పద్మ, వైసిపి నాయకులు గోగాడ జగన్నాథం నాయుడు, బాదిరెడ్డి శంకర్రావు పాల్గొన్నారు. వేపాడలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, మండల ఐఎస్‌డిటి అధ్యక్షులు సేనాపతి గణేష్.. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ, సిపిఎం నాయకులు చల్లా జగన్ కూడా అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

**బొబ్బిలిరూరల్ :** నారాయణప్పవలస పాఠశాలలో హెచ్‌ఎం జెసి రాజు ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

**గుర్ల :** మండలంలో గూడెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని మాల మహానాడు రాష్ట్ర ప్రధానకార్యదర్శి లోగిశ రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లోకసత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బీసెట్టి బాబ్జీ, కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రభాకరరావు, సర్పంచ్ లక్ష్మణరావు, మండల ఉపాధ్యక్షులు తిరుపతిరావు పాల్గొన్నారు.

# ఊరి బాగుకోసమే సచివాలయ వ్యవస్థ

### విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ● పల్లెగండ్రేడు సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-గుర్ల, మెరకముడిదాం

ఊరి బాగు కోసం, ప్రజలందరికీ మేలు చేయడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం గుర్ల మండలం పల్లె గండ్రేడు గ్రామంలో సుమారు రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, మెరకముడిదాం మండలం ఊటపల్లిలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి బొత్స మాట్లాడుతూ, గతంలో గ్రామాల్లో ప్రజలకు సేవలు అందించేందుకు ఒకరో ఇద్దరో ప్రభుత్వ సిబ్బంది ఉండేవారని, కాని ఇప్పుడు సచివాలయ వ్యవస్థ ద్వారా అత్యున్నత విద్యార్హతలతో కూడిన పదిమంది సచివాలయ కార్యదర్శులు అందుబాటులోకి వచ్చారని అన్నారు. మండల కేంద్రాలకు వెళ్లకుండానే మీ గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వసేవలను పొందవచ్చునని తెలిపారు. పేదల ఆకలితో రాజకీయాలు చేయబోమని, అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా పథకాలను అందిస్తున్నామని అన్నారు.



గుర్ల.. సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గత ప్రభుత్వం మాదిరిగా మోస పూరితమైన హామీలు ఇచ్చే ప్రభుత్వం తమది కాదని అన్నారు. గ్రామంలో సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని, రాజులపేట వరకు రోడ్డు, ఎస్‌సి కాలనీలో సిసి రోడ్లను నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాలంటే జగన్ మోహన్ రెడ్డికే మళ్లీ ఓటు వేయాలని కోరారు.

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. ఒక్క పల్లె గండ్రేడు గ్రామంలోనే గత నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సుమారు రూ.8.5 కోట్లను అందజేశామని చెప్పారు. గ్రామానికి సాగునీరు అందించామని, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామంలో నాలుగు విద్యుత్ స్తంభాలు, తాగునీటి బోరు నిర్మాణానికి ఎంపి నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, డిఎల్‌డిఒ లక్ష్మణరావు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, కెవి సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఊటపల్లిలో పలువురు టిడిపికి చెందిన నాయకులు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగంరెడ్డి లక్ష్మి, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల మోతీలాల్ నాయుడు, కోట్ల వెంకటరావు, కె.శివరామకృష్ణప్రసాద్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే

## సమస్యల పరిష్కారానికే గడపగడపకు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పోరలి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను క్షుణ్ణంగా వివరించారు. పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి మరో ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్, బిసి సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కడుబండి రమేష్ నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు సుమల శ్రీనివాసరావు, సర్పంచ్ మిత్తిరెడ్డి ధనలక్ష్మి పాల్గొన్నారు

## ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

ప్రజాశక్తి-డెంకాడ

డెంకాడ పిహెచ్‌సిలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఒ సూర్యనారాయణ మాట్లాడుతూ వెల్‌నెస్ సెంటర్లలో ప్రతి నెలా 14న ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రజారోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణ సేవలు, అంటువ్యాధులు, ఇఎన్‌టి వైద్య సేవలు, తదితర వాటిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, డాక్టర్ భవాని, పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపిటిసి వి.అచ్చెన్నాయుడు, డాక్టర్ శైలజ, సిహెచ్ఒ ఏసయ్య, విఒ సాంబమూర్తి, ఆశాలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొత్తవలస



మృతిచెందిన రాములు

ఎండతీవ్రతకు తట్టుకోలేక కొత్తవలస పంచాయతీ సంతమార్కెట్ ఎస్‌సి కాలనీకి చెందిన పొన్నకాయల రాములు(55) శుక్రవారం జంక్షన్‌లో కుప్పకూలి మృతి చెందాడు. రాములు కొత్తవలస ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో కళాసీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.